# వస్త్రాల ఆర్డర్ల రద్దు దుర్మార్గం




- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్
- 105 కోట్ల విలువైన ఆర్వీఎం ఆర్డర్ల నిలిపివేతతో నేతన్నల ఉపాధికి గండి
- కమిషన్ల కోసమే టెండర్ల విధానం.. ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర - రమేష్ ధ్వజం
- నూలు కొనుగోలు చేసిన తర్వాత ఆర్డర్లు రద్దు చేస్తే కార్మికుల పరిస్థితి ఏమిటి?
- 365 రోజులు పని కల్పించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవు - ప్రభుత్వానికి హెచ్చరిక

**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** రాష్ట్ర ప్రభుత్వం చేనేత, పవర్లూమ్ పరిశ్రమపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని సీఐటీయూ (జ×ఖ) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి టెస్కోకు ఇచ్చిన యూనిఫాం (ఏకరూప దుస్తుల) ఆర్డర్లను అకస్మాత్తుగా రద్దు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఆధీనంలోని విద్యాశాఖ, కేవలం కమిషన్ల కోసమే టెండర్ల ద్వారా ఈ ఆర్డర్లను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని చూడటం నేతన్నల పొట్ట కొట్టడమేనని విమర్శించారు. సిరిసిల్లలో ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తి కోసం ఇప్పటికే 50 కోట్ల రూపాయల విలువైన నూలును కార్మికులు కొనుగోలు చేశారని రమేష్ తెలిపారు. ఉత్పత్తి ప్రారంభమవుతున్న తరుణంలో 'ఉత్పత్తి చేయవద్దు' అని ఆదేశాలు జారీ చేయడం వల్ల నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ పరిస్థితుల వల్ల ధరలు పెరిగి వస్త్ర పరిశ్రమ కుదేలవుతున్న తరుణంలో, 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకునే పాలకులు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన అన్ని రకాల వస్త్రాలను చేనేత, పవర్లూమ్ కార్మికుల ద్వారానే ఉత్పత్తి చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే టెండర్ విధానాన్ని రద్దు చేసి, విద్యాశాఖ నుండి రావాల్సిన ఆర్డర్లను పునరుద్ధరిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, నాయకులు సిరిమల సత్యం, ఒగ్గు గణేష్, నక్క దేవదాస్, సందుపట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

- సిరిసిల్ల ఐడీఓసీలో ఘనంగా వీరనారి దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అదనపు కలెక్టర్, అధికారులు
- తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య త్యాగం చిరస్మరణీయం - గడ్డం నగేష్
- కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు మరియు సిబ్బంది



**నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల, (శివకుమార్):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య అని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (×ఊజ)లో అధికారికంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శరత్, నాయకులు ఎగుట్ల కనకయ్య, నాగం కుమార్, చిమల్ల మల్లేశం, స్తంబ లచ్చయ్య, వేముల నాగరాజు మరియు వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యేసుక్రీస్తు త్యాగం మానవాళికి స్వస్థత






- జెరూషలేము మినిస్ట్రీస్ బ్రదర్ శాంసన్ ఎఫ్రా
- సిలువపై యేసు పలికిన ఏడు మాటల అంతరార్థాన్ని వివరించిన దైవజనులు

**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలోని జెరూషలేము మినిస్ట్రీ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ వ్యవస్థాపకులు బ్రదర్ శాంసన్ ఎఫ్రా మాట్లాడుతూ.. యేసుక్రీస్తు పొందిన దెబ్బల ద్వారానే మానవాళికి స్వస్థత కలుగుతోందని, ఆయన త్యాగం అపరిమితమైన ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. సిలువపై యేసు పలికిన ఏడు మాటలను భక్తులకు క్లుప్తంగా వివరించిన ఆయన, శత్రువులను సైతం క్షమించే గుణాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పాస్టర్ అమ్మ మణిమాల మాట్లాడుతూ.. క్రీస్తు బలిదానాన్ని స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర దినాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 2500 మంది భక్తులు పాల్గొనగా, వారందరికీ జెరూషలేము మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆశీర్వాద భోజన వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సిస్టర్స్, ఇంచార్జీలు మరియు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపాలలో ఆరోగ్యజాగృతి

**ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించిన ఉపసర్పంచ్ తుమ్మ సతీష్**

**నేటి సాక్షి, మునగాల:** మునగాల మండల పరిధిలోని రేపాల గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ తుమ్మ సతీష్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు ఆశా వర్కర్లతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రబలే వైరల్ జ్వరాలు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తుమ్మ సతీష్ మాట్లాడుతూ.. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యవంతమైన గ్రామాన్ని నిర్మించుకోగలమని, పంచాయతీ తరఫున మరిన్ని పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు స్వయంగా ఇంటింటికీ వచ్చి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు.



# రక్తదానం చేయండి

**ప్రాణదాతలు కండి,గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అన్నపూర్ణ**



**నేటి సాక్షి గజ్వేల్:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 7వ తేదీ మంగళవారం గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరానికి 18 ఏళ్లు పైబడిన ఆరోగ్యవంతులైన యువతీ యువకులు తరలిరావాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడటమే కాకుండా, దాతల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని ఆమె వివరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త ఎర్ర రక్తకణాల ఉత్పత్తి పెరిగి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ అన్నపూర్ణ పేర్కొన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను వీడి, సామాజిక బాధ్యతగా భావించి యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రాణదాతలుగా మారాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ శిబిరానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# పల్లెగడ్డలో అంబలి కేంద్రం

**వేసవి తాపం నుంచి ఉపశమనం**



**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని పల్లెగడ్డ గ్రామంలో వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు శుక్రవారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా బాటసారులు, కూలీలు మరియు స్థానిక ప్రజల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో సామాజిక బాధ్యతగా అంబలి కేంద్రాన్ని నిర్వహించడం తమ గ్రామంలో ఆచారంగా వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ చల్లని అంబలి పంపిణీ కార్యక్రమం పట్ల బాటసారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పల్లెగడ్డ గ్రామస్తులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెల్మెట్ లేకుంటే యముడే మీ దోస్త్

**మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఘాటు హెచ్చరిక**



**నేటి సాక్షి, మునగాల:** మునగాల మండలంలో రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వాహనదారులకు కీలక సూచనలు జారీ చేశారు. "హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే.. అలాంటప్పుడు యముడే మీ దోస్త్ అవుతాడు" అంటూ ఆయన వినూత్నంగా, ఘాటుగా హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాదని, ప్రాణ రక్షణకు అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అతివేగం, మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఎస్ఐ పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధించడమే కాకుండా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా మాత్రమే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రజలు పోలీసులకు సహకరించి రహదారి భద్రతను మెరుగుపరచడంలో భాగస్వాములు కావాలని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# విద్యతోనే విజయ శిఖరాలు

**సాయి గాయత్రి విద్యాలయ చైర్మన్ ఆరవపల్లి శంకర్**



**నేటి సాక్షి, మునగాల:** విద్యనే విజయానికి మొదటి మెట్టుగా తీసుకుని ముందుకు సాగితేనే భవిష్యత్తు బంగారమయమవుతుందని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, సాయి గాయత్రి విద్యాలయ చైర్మన్ ఆరవపల్లి శంకర్ పేర్కొన్నారు. మునగాల మండల కేంద్రంలోని సాయి గాయత్రి విద్యాలయంలో 6వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడంలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని అన్నారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూనే, విద్యార్థులు పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. తమ ప్రతిభతో విద్యార్థులు సభలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక చేయూత

**అండగా నిలిచిన సింగిరెడ్డి నరేష్ రెడ్డి**



**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన పెండెల సుగుణ కుమారుడు నరేష్ విష్ణుప్రియల వివాహం స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగింది. ఈ నిరుపేద కుటుంబానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక చేయూత అవసరమని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ అడ్వైసరీ కమిటీ సభ్యులు, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఆయన తన వంతుగా రూ. 5,000 నగదును అందజేసి నూతన వధూవరులకు అండగా నిలిచారు. వీరితో పాటు మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు రూ. 5,000 ఆర్థిక సాయం అందించగా, ఏఎంసీ డైరెక్టర్ బలగం రాజేష్ మరియు రాజేందర్ చెరో 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ఇలాంటి సహాయం అందించడం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోతు అశోక్, ఉర్మడ్ల హన్మాండ్లు, అంకం శ్రీనివాస్, భూమల్ల మల్లేష్, బద్ది అంజయ్య, మ్యాకల రాజు, మేదరి శ్యామ్, మెట్టు ప్రకాష్, సామెల్, ఆశన్న, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం

**సర్పంచ్ గుగ్గిళ్ల రమేష్ చొరవ**



**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పనులను సర్పంచ్ గుగ్గిళ్ల రమేష్ శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, మురుగునీటి పారుదల సాఫీగా జరిగేలా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవితేజ, వార్డు సభ్యులు చంద భూమక్క, నాంతబాద్ నవీన్, ఎల్లా రాజేష్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొబిన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ యూసుఫ్, వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. వార్డుల్లో నెలకొన్న ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.


## రూరల్ ఎస్సైగా ఎస్. సతీష్ రెడ్డి

**బాధ్యతల స్వీకరణ**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్. సతీష్ రెడ్డి శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సతీష్ రెడ్డి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, మండల పరిధిలో శాంతిభద్రతలను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా వారి విశ్వాసాన్ని పొందాలని, నేర నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని ఎస్సై సతీష్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై రాముడు జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు.

## నూతన స్తంభాలు,ఏర్పాటు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ఒకటో వార్డులో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారమైంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి సహకారంతో, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టారు. జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ గూప చెన్నయ్య మరియు ఒకటో వార్డు సభ్యురాలు పెంటమీది రాజేశ్వరి రఘు చొరవతో వార్డులో నూతన విద్యుత్ స్తంభం మరియు కేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒకటో వార్డు ప్రజల అభ్యర్థన మేరకు స్పందించిన నాయకులు, వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయించారు. దీనివల్ల వార్డులో విద్యుత్ సరఫరా మెరుగుపడటమే కాకుండా, వేలాడుతున్న పాత తీగలతో పొంచి ఉన్న ప్రమాదం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డికి మరియు స్థానిక నాయకులకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు





**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని ప్రసిద్ధ బోయకొండ గంగమ్మ అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ దర్శించుకున్నారు. టిడిపి నాయకుడు మబ్బు దేవనారాయణ రెడ్డితో కలిసి వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో మొక్కుకున్న విధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేల రాకతో ఆలయ ప్రాంగణమంతా సందడి నెలకొంది.

## శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవం



**గోడిశెలపేటలో భక్తి సందడి**

**పాల్గొన్న హరీష్ రెడ్డి**

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధిలోని గోడిశెలపేట గ్రామంలో కొనసాగిన శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం, జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. శ్రీ దేవి, భూ దేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణోత్సవం అనంతరం శుక్రవారం నిర్వహించిన జాతర మహోత్సవం కన్నుల పండుగగా నిలిచింది. భక్తుల తాకిడి మధ్య పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలుకగా స్వామి వారి దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదిగా, మహిమాన్వితమైనదిగా స్థానికులు విశ్వసిస్తున్నారని తెలిపారు. స్వామి వారి కటాక్షం ప్రజలందరిపై ఉండాలని, అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వ్యాళ్ల రాంరెడ్డి, అల్లే వెంకటేష్ యాదవ్, ఆలయ చైర్మన్ సబ్బు కేశవ్, కొమ్ము సంజీవ్ యాదవ్, అరికిళ్ల మహేందర్, సాంబరి సతీష్ కుమార్, వన్నెల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కొండ్రాపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని కొండ్రాపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామస్తులందరూ అభివృద్ధి పనులకు సహకరించాలని, ప్రతి వార్డులో దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# త్యాగానికి ప్రతిరూపం యేసుక్రీస్తు





**నేటి సాక్షి, కర్నూలు:** కర్నూలు ఎస్ఏపి క్యాంప్ (రాయ్రా ఝుఎజూ) సిఎస్ఐ సంఘంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ ప్రార్థనా కూటములకు ముఖ్య అతిథిగా హాజరైన డీనరీ చైర్మన్ రెవరెండ్ వేల్పుల ప్రసాద్ బాబు దైవ సందేశాన్ని ఇస్తూ.. మానవాళి అతిక్రమాలను బట్టి యేసుక్రీస్తు గాయపరచబడ్డారని, ఆయన చిందించిన రక్తము ద్వారానే లోకానికి పాప విముక్తి కలిగిందని పేర్కొన్నారు. సిలువపై యేసు పలికిన ఏడు మాటల

**● డీనరీ చైర్మన్ వేల్పుల ప్రసాద్ బాబు**

అంతరార్థాన్ని భక్తులకు క్లుప్తంగా వివరించిన ఆయన, ప్రతి ఒక్కరూ ప్రేమ, సమాధానం, జాలి కలిగిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ వేల్పుల శాంతకుమారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు విజయవంతంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ భాష విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కులమతాలకు అతీతంగా యేసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గం అందరికీ ఆదర్శనీయమని ఆయన అన్నారు. తనను హింసించిన వారిని సైతం క్షమించిన గొప్ప గుణం క్రీస్తుదని, ఆవేశకావేశాలకు తావు లేకుండా క్షమాగుణంతో మెలగాలని సూచించారు. అనంతరం సంఘ విశ్వాసులకు, పెద్దలకు మరియు చిన్నపిల్లలకు ఆశీర్వాద భోజన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెప్సీబా రాణి, నిర్మలా దేవి, పద్మతో పాటు సంఘ పెద్దలు, భారీ సంఖ్యలో క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# మునగాలలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**నేటి సాక్షి మునగాల:** మునగాల మండలంలోని పెనుయేలు సంఘాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుయేలు సంస్థ వ్యవస్థాపకులు ఆర్చి బిషప్ డాక్టర్ జె. సుదర్శనం ఆదేశాల మేరకు, తెల్లవారుజాము నుండే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. మునగాలలో ఆర్చి బిషప్ డాక్టర్ జె. సుదర్శనం స్వయంగా వేడుకలను పర్యవేక్షించగా, బరాఖత్ గూడెంలో బిషప్ జె.జె. సామ్యూల్ సన్, మాధవరం, రేపాల, సీతానగరం గ్రామాల్లో పాస్టర్ ఎం. రాజేష్, తిమ్మారెడ్డిగూడెంలో పాస్టర్ జె. సమూయేలు, తాడ్వాయిలో ఎం. లూకా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రార్థనా కూటముల్లో యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను సంఘ పెద్దలు భక్తులకు చదివి వినిపించారు. అనంతరం ఆయా సంఘ కాపరులు సిలువ త్యాగం యొక్క విశిష్టతను వివరిస్తూ దైవ సందేశాన్ని అందించారు. లోక రక్షణ కోసం క్రీస్తు పడిన శ్రమలను స్మరిస్తూ, ప్రపంచ శాంతి కోసం క్రైస్తవులంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కె. రాజు, కరుణ, మాధవి, సువార్తమ్మ, అబ్రహాం, విజయమ్మ, మరియమ్మ, యిర్మియా, విక్టోరియమ్మ, జెకర్య, తబితతో పాటు భారీ సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# పెద్దకడబూరులో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

**నేటి సాక్షి, పెద్దకడబూరు:** పెద్దకడబూరు మండల కేంద్రంలో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిలువ యాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్సీఎం (=జవీ) చర్చి ఫాదర్ రాజేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో ఆయన స్వయంగా సిలువను మోస్తూ క్రైస్తవ పాలెంలోని ప్రధాన వీధుల గుండా ముందుకు సాగారు. లోక రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై అనుభవించిన శ్రమలను, ఆయన చేసిన మహోన్నత త్యాగాన్ని స్మరిస్తూ భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ రాజేంద్ర రెడ్డి భక్తులకు సందేశమిస్తూ.. క్రీస్తు త్యాగం మానవాళికి మార్గదర్శకమని, ఆయన చూపిన ప్రేమ, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. యాత్ర పొడవునా భక్తులు ప్రార్థనలు చేస్తూ, భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి సంఘ పెద్దలు, మహిళలు, యువత మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# పెద్దకడబూరు ఎస్ఐ కలిసిన టీడీపీ నేత కోడిగుడ్ల ఏసేపు



**నేటి సాక్షి, పెద్దకడబూరు:** పెద్దకడబూరు మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఈ. మారుతిని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. విధుల్లో సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని, బాధితులకు న్యాయం చేయడంలో ముందుండాలని ఎస్ఐకి సూచించారు. ప్రజాప్రతినిధులు మరియు పోలీసుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి, రక్షణ సాధ్యమవుతుందని పేర్కొంటూ, పోలీసు శాఖకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కోడిగుడ్ల ఏసేపు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రేపాల పీహెచ్‌సీలో సురక్షిత ప్రసవం

- గర్భిణికి అండగా నిలిచిన డాక్టర్ వినయ్ కుమార్
- పురిటి నొప్పులతో వచ్చిన జగన్నాథపురం గ్రామానికి చెందిన లక్ష్మీ భవానికి తక్షణ వైద్యం
- వైద్యుల చాకచక్యంతో సురక్షితంగా ప్రసవం - క్షేమంగా ఉన్న తల్లి మరియు మగ శిశువు
- గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్య సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు





**నేటి సాక్షి, మునగాల:** మునగాల మండలంలోని రేపాల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆకే) వైద్య సిబ్బంది తమ సేవాభావాన్ని చాటుకున్నారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన వెంపటి వీరబాబు కుమార్తె లక్ష్మీ భవానికి అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ వినయ్ కుమార్ పరిస్థితిని సమీక్షించి, ఎటువంటి జాప్యం లేకుండా తక్షణ వైద్య సహాయం అందించారు. గర్భిణి పరిస్థితిని నిశితంగా గమనించిన డాక్టర్ వినయ్ కుమార్ మరియు సిబ్బంది, అత్యంత జాగ్రత్తతో సురక్షితంగా ప్రసవం జరిపించారు. ప్రస్తుతం తల్లి మరియు మగ శిశువు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తమకు అండగా నిలిచి, సురక్షితంగా ప్రసవం చేసినందుకు బాధితురాలి కుటుంబ సభ్యులు వైద్యులకు మరియు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేడు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఏ చిన్న ఇబ్బంది కలిగినా వెంటనే సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు. సకాలంలో వైద్యం అందడం వల్ల తల్లి-శిశు మరణాలను అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బండారుపల్లిలో విషాదం

## గుండెపోటుతో యువకుడి మృతి.. అండగా ఉంటామన్న సర్పంచ్



**నేటి సాక్షి, తొగుట (వడ్డే నరసింహులు):** తొగుట మండలం బండారుపల్లి గ్రామంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దోసాని నరేష్ (32) అనే యువకుడు గురువారం రాత్రి హనుమాన్ జయంతి విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే గుండెపోటుతో మరణించారు. ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్న యువకుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కోల వెంకట్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నరేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నరేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి గ్రామం మొత్తం అండగా ఉంటుందని హామీ ఇస్తూ, గ్రామస్తుల తరపున రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోల శ్రీనివాస్ గౌడ్, బుడగం పరమేశ్వర్ రెడ్డి, కోల శ్రీకాంత్, రేబర్తి మహేందర్, మేడల కిరణ్ రెడ్డి, మజ్జిగ వెంకట్ రెడ్డి, ముత్యాలు, నర్సింలు, జాలిగామ నవీన్ తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, కనులపండువగా జరిగింది. వార్షిక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే సంప్రదాయబద్ధంగా రథం ముందు దివిటీలు వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు "గోవిందా.. గోవిందా.." అంటూ నామస్మరణ చేస్తూ రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ఆచారం ప్రకారం భక్తులు రథం ముందు మేకలు, గొర్రెలు మరియు కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. ఈ వేడుకలో గన్నేరువరం సర్పంచ్ రంగన్నవేణి లచ్చి నర్సు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. గన్నేరువరం వీధులన్నీ భక్తుల కోలాహలంతో సందడిగా మారాయి.

# మహనీయుల యాదిలో

## సొసైటీ మాజీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి...



**నేటి సాక్షి తొగుట,(వడ్డే నరసింహులు):** తొగుట మండలంలోని గుడికందుల గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భగత్ సింగ్ గా పిలువబడే దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని కురుమ సంఘం నాయకులు గ్రామంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా ఆనాడు దొడ్డి కొమురయ్య పోరాటం చేసిన తొలి తెలంగాణ అమరవీరుడుని గుర్తు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడ కూడా మహనీయుడు దొడ్డి కొమురయ్య విగ్రహం లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉద్యమాల గడ్డ గుడికందుల గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు కంతుల లక్ష్మణ్, ఉప సర్పంచ్ పర్షయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లుగారి శ్రీకాంత్ రెడ్డి, కుర్మ సంఘం నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ఘాట్ వద్ద లారీ బోల్తా

## రచ్చమర్రి రైతు యాకోబు దుర్మరణం



**నేటి సాక్షి, మంత్రాలయం:** మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన రైతు యాకోబు దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గుంటూరు మిర్చి యార్డులో మిరపకాయలు అమ్ముకుని లారీలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, ఆత్మకూరు ఘాట్ రోడ్డు వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న బియ్యం సంచులు యాకోబుపై పడటంతో తీవ్ర గాయాలపాలై ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యాకోబు మరణంతో భార్యాపిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం అందించి సహాయం చేయాలని గ్రామస్తులు మరియు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. యాకోబు భౌతికకాయాన్ని పలువురు స్థానిక నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

